సెప్టెంబర్ - అక్టోబర్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక



## దేనిని బట్టి నీ సంతోషం?



# "మనస్సులోని మాట"

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

క్రీస్తు నందు ప్రియులైన మీ అందరికి శుభములు ఎలా ఉన్నారు ? రాష్ట్రమంతటా విస్తారముగా వర్షములు పడుతున్నాయి కదా! ప్రాజెక్టులలోను, చెరువులలోను నీరు చేరి ఈ సంవత్సరం పంట పొలములకు పుష్కలంగా నీరు అందుబాటులో ఉండడం సంతోషించదగిన విషయం. అధిక వర్షముల వలన అంటురోగములు ప్రబలి, రాష్ట్రంలో ఎటువంటి ప్రాణహాని కలగకుండా బాధ్యతతో ప్రార్థన చేయుదుము.

ప్రభువు మనకి అనుగ్రహించిన రక్షణను బట్టి ఎల్లప్పుడూ కృతజ్ఞతాస్తుతులు చెల్లించవలసిన వారమై యున్నాము. ఈ లోక సంపదలన్నిటి కంటే ఎంతో విలువైనది దేవుడు మనకి అనుగ్రహించిన రక్షణ. రక్షణ అనేది నీళ్ళలో ముంచడం ద్వారా సంక్రమించేది కాదు కానీ ఒక వ్యక్తి మనస్సు మార్చుకొని, తాను చేసిన పాపముల కొరకు దేవుని సన్నిధిలో పశ్చాత్తాపపడటం వలన దేవుని ద్వారా కలిగే పాపక్షమాపణ నిశ్చయత. దేవుని వలన మనకి కలిగే రక్షణ లేక క్రొత్త జన్మ అనుభవం ఈ లోక జ్ఞానమునకు అర్థమయ్యేది కాదు కాని దేవుని వలన మానవుని జీవితంలో కలిగే అద్భుతమైన పరివర్తన. అట్టి పరివర్తన జన్మ, కర్మ, పాపముల నుండి విడిపించి, పరలోకరాజ్యమునకు వారసులుగా చేయును. మనలో అనేకులము ఇట్టి రక్షణ భాగ్యము కలిగి యున్నందు వలన ధన్యులము.

ఇంకను ఇట్టి రక్షణ అనుభవము ఎరగకుండా జీవిస్తున్న స్పర్శ పాఠకులకు నా హృదయ పూర్వకమైన మనవి ఏదనగా ఇంత గొప్ప రక్షణను నిర్లక్ష్యం చేసి ఏలాగు తప్పించుకొందురు? గనుక ఆయన దొరుకు కాలములోనే ఆయనను వెదికి, రక్షణ మార్గములను కనుగొనవలెను. దేవుని వలన అనుగ్రహించబడే ఉచిత రక్షణను పొందుటకు విశేషాసక్తి గలవారై జీవించాలని కోరుచున్నాను.

అట్టి భాగ్యము దేవుడు మీకు దయచేయును గాక !

మీ సహోదరుడు.....



సెప్టెంబర్ - అక్టోబర్, 2010

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేనిని బట్టి సంతోషం? ........ 2
- విధేయులు ........ 5
- ఆత్మ విశ్వాసము గల స్త్రీ (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- ప్రశాంతమైన జీవితము -3వ భాగము ........ 9
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 12వ భాగము ........ 11
- మంచి ఫాదర్ (బాలల శీర్షిక) ........ 13
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 15
- ఇది తెలుసా? ........ 17
- ఆత్మ ఫలము ........ 18
- కరుడు కట్టిన క్రైస్తవ్యం ........ 20
- హెర్మోను పర్వతము ........ 21
- బైబిల్ క్విజ్-12 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23


మా చిరునామా: ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-500 070, ఫోన్: 040-2420 2227

# దేనిని బట్టి సంతోషం ?



**"యెహోవాను బట్టి సంతోషించుము ఆయన నీ హృదయవాంఛలను తీర్చును" - కీర్తన 37:4**

మనుష్యులు దేనిని బట్టి సంతోషించుచున్నారు అని మనము గమనిస్తే, మానవుని, అతని కొరకు సమస్తమును సృష్టించిన సృష్టికర్తయైన దేవుని విడిచిపెట్టి బంగారము, వెండి, దాసదాసీలు, భూములు చూచుకొని సంతోషించుట అధికమైపోయింది. మనము ఎక్కడికి వెళ్ళినా, ఎంత సంపాదించారు? ఇల్లు కట్టుకున్నారా? కారు కొన్నారా? కనీసం ప్లాట్ అయినా కొనుక్కున్నారా? అన్న ప్రశ్నలు తప్ప మరేమీ వినిపించట్లేదు. చివరికి బోధకులైన వారు సహితము, నేను ఇంత పెద్ద మందిరము కట్టాను, దానిని ఎంతో సుందరంగా తీర్చిదిద్దాను, ఇన్ని వందల మంది లేక వేల మంది నా దగ్గరికి వస్తారు అని బహుగా సంతోషించడం ఈ దినములలో మనం చూస్తున్నాము. మానవ జీవితంలో అతి ముఖ్యమైన శాంతి, సమాధానము మరియు పరలోకరాజ్యమును గూర్చిన మాటలు నేటి దినములలో ప్రాధాన్యత లేనివిగా అనేకులు భావిస్తున్నారు. కానీ క్రీస్తుని అంగీకరించిన వారికి దేవుడు అనుగ్రహించిన వాగ్దానమును మనము గమనిస్తే, " మన హృదయవాంఛలు తీర్చబడాలంటే దేవుని యందే సంతోషించాలి" అలా కాక దేని యందు సంతోషించినను, అది నిజమైన సంతోషం కాదు, మన జీవితమునకు తృప్తిని ఇవ్వలేదు. అంత మాత్రమే కాక, తీవ్రమైన నిరాశను, కొన్నిసార్లు జీవితము మీద విరక్తిని కూడా కలిగిస్తుంది.

**దేవుని యందు ఏ విధంగా సంతోషించాలో మనము తెలుసుకుందాము :-**

**1. దేవుడు అనుగ్రహించిన రక్షణను బట్టి సంతోషించుట :-**

రక్షణ అనగా మానవుని జీవితములోని జన్మ, కర్మ, పాపముల నుండి క్షమింపబడి, తద్వారా నిత్య అగ్నిగుండము నుండి రక్షింపబడుట. మన పాపములను హృదయ పూర్వకంగా ఒప్పుకొని, పాపక్షమాపణ నిశ్చయత పొంది, బాప్తిస్మం తీసికొనుట ద్వారా రక్షణ కార్యం సంపూర్ణమవుతుంది. కేవలం బాప్తిస్మం మాత్రమే రక్షణ కాదు. ఇది ఒక మహత్తర కార్యము, యేసుక్రీస్తు వలన మాత్రమే మానవాళికి ఇవ్వబడిన అమూల్యమైన కానుక. దీనిని బట్టి ఎంత సంతోషించినను మన జీవితంలో తరిగిపోనిది. అందుకే అపోస్తలుడైన పేతురు తన మొదటి పత్రికలో చెప్పనశక్యమును, మహిమాయుక్తమునైన సంతోషము గలవారై ఆనందించుచున్నారు అని రక్షణను గూర్చి వ్రాయుట జరిగింది. రక్షణ ఆనందము గురించి

ఎంత చెప్పుకొన్నప్పటికి వర్ణించడం వీలుకానిది. జీవితంలో ఆ ఆనందము వివరించడానికి మానవ జ్ఞానము సరిపోదు, కనుక రక్షణను బట్టి మనము ఎల్లప్పుడూ ఆనందించే వారిగా ఉండాలి. **కీర్తన 35:9, హబక్కూకు 3:18,** వచనములలో రక్షణను బట్టి సంతోషించడం కనబడుచున్నది. హబక్కూకు గ్రంథములో ఈలాగు వ్రాయబడింది. అంజూరపు చెట్లు పూయకుండినను, ద్రాక్ష చెట్లు ఫలింపకపోయినను, ఒలీవ చెట్లు కాపులేక యుండినను, సాలలో పశువులు లేకపోయినను, ఎముకలు క్రుళ్ళిపోవుచున్నను అతని రక్షణానందమును ఏదీ పాడు చేయలేకపోయినది. ఎంత ఆశ్చర్యం, మన జీవితంలో రక్షణను గూర్చిన ఆనందం ఇంత బలమైనదిగాను లేక స్థిరమైనదిగాను ఉన్నదా? నిజక్రైస్తవుడు తప్పక ప్రతి దినమూ తన రక్షణను బట్టి సంతోషించ వలసిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకనగా రక్షణను బట్టి సంతోషించలేని వాడు క్రీస్తుని అంగీకరించడంలో అర్థం లేదు. దేవుని యొద్ద నుండి ఎన్ని స్వస్థతలు, ఆశీర్వాదములు పొందినప్పటికి, అన్నింటికన్నా మొదటి స్థానంలో ఉండే అద్భుతం రక్షణ మాత్రమే. అందుకే రక్షణను బట్టి సంతోషించాలి.

**2. ఆయన బలమును బట్టి సంతోషించుట :-**

**యెహోవా, రాజు నీ బలమును బట్టి సంతోషించుచున్నాడు, నీ రక్షణను బట్టి హర్షించుచున్నాడు. - కీర్తన 21:1**

దావీదు రాజై యుండి కూడా తన బలమును బట్టి కాక, దేవుని బలమును బట్టి సంతోషించుచున్నాడు. సామాన్యమైన మానవులు సహితము ఈ దినములలో వివాహముల లోనూ, ఆయా సమయములలోనూ, బంధుమిత్రులను ఆహ్వానించి, తమ స్థితిని లేక తమ బలమును వారికి కనపరచాలని, దానిని బట్టి సంతోషించాలని చూస్తూ ఉంటారు. ఒకరోజు వెనుక శత్రువులు, ముందు సముద్రము ప్రజలు ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి. కానీ మన దేవుడు తన బాహుబలము చేత సముద్రమును పాయలుగా చేసి తన ప్రజలను కాపాడుట మాత్రమే కాక, శత్రువులను ఆ సముద్రములో ముంచి వేసినవాడు. ఆయన బలమునకు విరోధమైన రాజులు, రాజ్యములు, దేవుడు లేక దేవతలు అనబడినవారు నిలవబడడం అసంభవం. కారణం ఆయన సర్వశక్తి కలిగిన వాడు. ఆయన బలము గూర్చి ఆలోచిస్తే, మానవుని జీవితంలోని ప్రతి క్లిష్ఠ పరిస్థితులను సరి చేయగలవాడు. ఈ భూమి మీద



ఉన్న ఏ సమస్య అయినా పరిష్కరించడం ఆయనకి సాధ్యమే. యుద్ధములో అవసరతని బట్టి ఒక దినమంతా సూర్య, చంద్రులను ఆపినవాడు, ఈ సర్వ సృష్టిపై అధికారం కలిగి

ఉన్నవాడు అందుకే ఆయన బలమును బట్టి ఎంతగానో సంతోషించవలసిన వారమై యున్నాము.

## 3. దేవుని నిమిత్తం హింసను బట్టి సంతోషించుట :-

**నూతన నిబంధనా గ్రంథంలో "నా నిమిత్తము జనులు మిమ్మును నిందించి హింసించి మీ మీద అబద్ధముగా చెడ్డ మాటలెల్ల పలుకునప్పుడు మీరు ధన్యులు. సంతోషించి, ఆనందించుడి, పరలోకమందు మీ ఫలము అధికమగును" - మత్తయి 5:11,12.**

ఒకరోజు స్తెఫను అనే పరిచారకుడు క్రీస్తుని గురించి తెలియని ప్రజలకు తెలియపరుస్తూ ఉండగా, రాళ్ళతో కొట్టి చంపడం జరిగింది. రాళ్ళ దెబ్బలు తింటూ, మరణిస్తున్న సమయంలో ఆకాశం తెరవబడి, దేవుడు తన కొరకు లేచి నిలవబడడం చూచి, ఎంతగానో సంతోషిస్తున్నాడు. అందుకే రాళ్ళతో కొట్టిన వారిని క్షమించమని ప్రార్థన చేసాడు. దేవుని యెడల మన ప్రేమ, ఇలాంటి సమయములలోనే వెల్లడి అవుతుంది. ఏ మార్గములలోనూ కనిపించని ఒక విషయం యేసు క్రీస్తు మార్గములో కనబడుతుంది. అదే నిందలలో, హింసలలో చెడ్డ మాటలు మన యెడల పలుకుతున్నప్పుడు సంతోషించడం. అందుకే మన పితరులను అగ్నిగుండములో, సింహాల బోనులో వేసినా వారిలో ఆనంద సంతోషాలే వ్యక్తమయ్యాయి. కొరడాలతో కొట్టినా, రాళ్ళతో హింసించినా వాటిని బట్టి కూడా సంతోషించినట్లు బైబిల్ గ్రంథంలో మనం చూడగలుగుతాము.



ప్రియ సహోదరి, సహోదరులారా! మీ హృదయవాంఛలు తీర్చబడుచున్నాయా ? కోరికలు నెరవేరడం కోసం మనుష్యులు ఆపదమ్రొక్కులు మ్రొక్కుకుంటూ, గురూజీలను ఆశ్రయిస్తూ, తీర్థయాత్రలు చేయుచూ, పుణ్యకార్యములు జరిగిస్తూ, తీవ్రంగా శ్రమిస్తూ ఉంటారు. కానీ కోరినది సిద్ధించుటకు ప్రభువు, ఆయనను విశ్వసించిన వారికి నిర్ణయించిన ఒక మార్గము దేవునిని బట్టి సంతోషించడం. **కనుక ఆయన రక్షణను బట్టి, ఆయన బలమును బట్టి, ఆయన నిమిత్తం హింసించ బడుటను బట్టి సంతోషించవలసిన వారమై యున్నాము.** అప్పుడు మన హృదయవాంఛలు తీర్చబడతాయి.

అట్టి ధన్యత దేవుడు మీకు దయచేయును గాక!

# విధేయులు

## <u>దేవుని యందు విధేయత గలవారి లక్షణములు :-</u>

కృతజ్ఞత కలిగి ఉంటారు.

లోబడేవారిగా ఉంటారు.

ఎవ్వరిని విమర్శించరు, తీర్పు తీర్చరు, నేరములు మోపరు.

సాత్వికులుగా ఉంటారు.

గర్వించరు.

తమ్ముని తాము తగ్గించుకుంటారు.

సమాధానపరిచే వారిగా ఉంటారు.

శాంతితో జీవిస్తారు.

ఓర్పు కలిగి సహించుకుంటారు.

చేసిన తప్పులను ఒప్పుకునే వారిగా ఉంటారు.

ప్రతి ఒక్కరితో స్నేహంగా ఉంటూ అందర్ని ప్రేమిస్తారు.

సున్నితమైన మనస్సాక్షిని కలిగి ఉంటారు.

దేవుని దిద్దుబాటుని ఒప్పుకుంటారు.

దేవుడు వారిని దిద్దాలని కోరుకుంటారు.

# ఆత్మ విశ్వాసము గల స్త్రీ

- సిస్టర్ విజయ

కొందరు స్త్రీలు ఆత్మ విశ్వాసము గల వారిగాను, మరికొందరు ఆత్మవిశ్వాసము లేని వారిగాను ఉంటారు. ఆత్మవిశ్వాసము అనగా ఏమై యున్నది? అని గమనిస్తే మనము చేయగలిగే వాటిని ధైర్యంగా చేస్తూ, చేయలేని వాటిని గూర్చి చింతించకపోవుట. ఆత్మవిశ్వాసము జీవితములో ధైర్యము, యదార్థతతో, ఎలాంటి ఆందోళన లేకుండా జీవించ డానికి ఎంతగానో సహాయపడుతుంది. ఆత్మవిశ్వాసము గల స్త్రీలు తమ సామర్థ్యమును వృద్ధి చేసుకొనుటలో ముందుకు సాగుతూ ఎల్లప్పుడూ క్రొత్త విషయములను నేర్చుకోవడానికి సిద్ధంగా ఉంటారు.

ఆత్మవిశ్వాసము లోపించిన స్త్రీలు దేనిని గూర్చి ఒక ఖచ్చితమైన నిర్ణయమును తీసుకోక, రెండు మనస్సులు కలిగి భయంతో, సంపూర్ణముగా జీవించలేరు. ఆత్మవిశ్వాస లోపము హృదయములో కలవరములను కలుగచేసి, ఎడతెగని విసుగుదలను కలిగిస్తుంది. దేవుడు అనుగ్రహించిన ధన్యకరమైన జీవితమును అనుభవించలేరు.

**ఆత్మవిశ్వాసముతో జీవించే పద్ధతులను ధ్యానిద్దాము : -**

**1. మనము ప్రేమించబడుచున్నామని గ్రహించాలి :-**

దేవుడు స్త్రీలమైన మనలను ప్రత్యేకంగా ప్రేమిస్తున్నాడు అనే విషయమును గమనించాలి. కనుక నేను ప్రేమించబడతానో లేదో అనే భయం మన జీవితంలోనికి రానియ్యకూడదు. ఎందుకనగా దేవుడు మనలను ప్రేమిస్తున్నారు అంటే ప్రేమించే అనేకులను మనకి అనుగ్రహిస్తారు. మనలను గూర్చి మనము చెడుగా భావించుకోవడం మానివేయాలి. నేను ఎంత మాత్రం మంచిదానను కాను అనే అభద్రతా భావం మనలో ఉండకూడదు. మనలను గాయపరిచే వ్యక్తుల మధ్య కాక, భద్రత కలిగించే వారితో మనం ఉండాలి. మనలను గాయపరిచేది ఎవరో, ఆదరించేది ఎవరో తెలుసుకోవడానికి దేవునిని జ్ఞానం అనుగ్రహించమని వేడుకోవాలి. ప్రేమ గాయమలను స్వస్థపరిచే ఔషధం. మన దేవుడు మనకి ఆ ప్రేమను ఉచితంగా, ఎడతెగకుండా అనుగ్రహించాడు. మనము ఆయనకి ఇష్టులుగా ఉంటేనే ఆయన ప్రేమిస్తాడని కాదు, అన్ని సమయములలోను గాఢంగా ప్రేమిస్తారు. మనం ఆయన ప్రేమకు యోగ్యులము కాదు కాని ఆయన మంచితనము వలన మనలను ప్రేమించాలని ఆశించాడు.

**"ఎట్లనగా తన ప్రియుని యందు తాను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృపా మహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయాసంకల్పము చొప్పున, యేసుక్రీస్తు ద్వారా తనకు**

**కుమారులనుగా స్వీకరించుటకై, మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని మనము తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునై జగత్తు పునాది వేయబడకమునుపే, ప్రేమ చేత ఆయన క్రీస్తులో మనలను ఏర్పరచుకొనెను." ఎఫెసీ 1:4-6**

దేవుడు మనలను ఎంతగా ప్రేమిస్తున్నాడో గుర్తిస్తే తప్ప మనలను మనము నిజముగా ప్రేమించుకొనలేము. మనలను మనం ప్రేమించుకోలేనప్పుడు ఇతరులను కూడా ప్రేమించలేము. మన జీవితంలో యేసు అనే బలమైన పునాది లేకుండా ఇతరులతో మంచి సంబంధాలను కలిగి యుండలేము. మనం దేవుడు అనుగ్రహించే ఉచిత ప్రేమను అర్థం చేసుకొని, స్వీకరించాలి. అంత మాత్రమే కాక దేవునికి కృతజ్ఞులమై యుండాలి. నన్ను ఆయన శాశ్వతమైన ప్రేమతో ప్రేమిస్తున్నాడు కనుక నేను ఆయన ప్రేమను పొందుకుంటున్నాను అని మన మనస్సుతో చెప్పవలసిన వారమై యున్నాము. అనేక సార్లు ఈ మాటని ఈ విధంగా పలుకుట ద్వారా ఈ సత్యం హృదయంలో చేరుతుంది. మనము నమ్మిన దేవుడు మనలను ఎంత ఎక్కువగా ప్రేమిస్తున్నారు అనే సంగతి ఎంతో ఆదరణ మరియు ధైర్యమును కలిగిస్తుంది. దేవుడు మనలను ప్రేమించడం మాత్రమే కాక, మనలను నిజముగా ప్రేమించే వ్యక్తులను అనుగ్రహిస్తారు. మనలను నిజాయితీగా ప్రేమించే వ్యక్తులను కలిగియుండుట ఒక అద్భుత బహుమానం. అందుకు దేవునికి కృతజ్ఞత కలిగి జీవిద్దాము.

**2. అనుకూల వైఖరిని కలిగి యుండాలి -**

ఆత్మవిశ్వాసము, వ్యతిరేక ఆలోచనా విధానము రెండు కలిసి యుండలేవు. ఇవి నీరు మరియు నూనె లాంటివి. అనేకమంది వ్యతిరేక ఆలోచనలు మాత్రమే కలిగి ఉంటారు. అనుకూల ఆలోచనలు కలిగి ఉండేవారు చాలా అరుదుగా ఉంటారు. వీరి జీవితం ఆనందంగాను, ఫలభరితంగాను ఉంటుంది. అనుకూలముగానా? వ్యతిరేకముగానా? ఏ విధంగా ఆలోచించాలి? అని నిర్ణయించు కోవలసినది మనమే. మన క్రియలు, మాటలు మన ఆలోచనలతో ముడి పడి ఉంటాయి. మరి కొన్నిసార్లు మన చుట్టూ ఉండే వాతావరణం, మనుష్యులను బట్టి కూడా ఉండవచ్చు. వ్యతిరేకమైన ఆలోచనలు గలవారితో ఉండడం ప్రజలకు ఎంత మాత్రమూ ఇష్టం ఉండదు. వ్యతిరేక ఆలోచనలతో నీవు జీవిస్తుంటే, నువ్వు అంటే ఎవ్వరికి ఇష్టం ఉండదు. అనేక సమస్యలకు మరియు నిరుత్సాహములకు ఇదే స్వభావం కారణం అవుతుంది. సమస్యలు ఎక్కువగుచున్న కొలది వ్యతిరేక స్వభావం మరింతగా పెరిగిపోతుంది. ఒక స్త్రీ ఎప్పుడూ అనుకూల ధోరణితో ఉండుట వలన తన పిల్లలను, ఇంటివారిని క్షేమకరమైన దారిలో నడిపించుకోగలుగుతుంది.

ఉదాహరణకు సగం ఖాళీగా ఉన్న గ్లాసులోని ఖాళీని చూచే బదులుగా సగం నిండుగా ఉన్న గ్లాసు చూడవచ్చు. జీవితంలో ఉన్న కొన్ని సమస్యలను చూచే బదులు ఎన్నో మంచి విషయములను చూడవచ్చు. మనుష్యులు చింతించే వాటిలో 90% ఏమాత్రమూ చింతించవలసిన అవసరం లేనివి అని ఒక సర్వే తెలియజేసింది. అయితే అనేకమంది ప్రజలు అనుకూలముగా ఆలోచించుట కంటే వ్యతిరేకముగా ఆలోచించుటే మంచిదిగా భావిస్తుంటారు. మన ఆలోచనా విధానం దేవుని ఆలోచనా విధానంగా ఉందా? లేక అపవాది ఆలోచనా విధానంగా ఉందా? అని పరిశీలించుకోవాలి. జీవితంలోని వ్యతిరేక ఆలోచనా విధానము దుఃఖమును, అనుకూల ఆలోచనా విధానము సంతోషమును కలిగిస్తాయి.



ప్రియ సహోదరి! ఆత్మ నూన్యతా భావముతో జీవిస్తుంటే, ఈ క్షణమందే ఆ స్థితి నుండి బయటికి రమ్మని దేవుని పేరట మిమ్మును బ్రతిమాలుకొనుచున్నాను. ఎందుకనగా నీవు అందంగా లేకపోయినను, ఆస్థిమంతురాలివి కాకపోయినను, నీ బాధను వినేవారు లేరనుకుంటున్నను నీవు **దేవుని చేత ప్రేమించబడుచున్నావన్న** విషయమును గమనించు. **అనుకూల వైఖరితో** ఆలోచించడం ప్రారంభించు. ఇక జీవితంలో వెనుదిరగ వలసిన అవసరం లేదు. ఆత్మ విశ్వాసముతో, ధైర్యం కలిగి ముందుకి సాగిపోయే స్త్రీగా దేవుడు నిన్ను తీర్చిదిద్దుతాడు, సదా తోడై యుండి నడిపిస్తాడు.

అట్టి కృప దేవుడు మనకి దయచేయును గాక!

# ప్రశాంతమైన జీవితము

3వ భాగము

**5. గుర్తింపు కొరకు ప్రాకులాడవద్దు :-**

సాధారణముగా మానవుని జీవితంలో తమను అందరూ గుర్తించాలని భావిస్తూ ఉంటారు. తాము కలిగి ఉన్న అంచనాల ప్రకారం జరగనప్పుడు ఎంతో నిరుత్సాహపడడం కనబడుతుంది. అందుకే మనం గుర్తింపుని ఆశించనప్పుడు ప్రతి పరిస్థితిలోనూ సంతోషంగా ఉండగలుగుతాము. గుర్తింపబడుట అనేది, దాని కొరకు ప్రాకులాడుట వలన దొరికేది కాదు. ఈ విషయంలో అనేకులు గ్రహింపు లేకుండా, ప్రవర్తిస్తూ ఉంటారు. పేరు ప్రఖ్యాతులు గలవారితో ఉంటూ, అందరిలో గుర్తింపు పొందాలని ప్రయత్నిస్తారు. నిజమైన గుర్తింపు మన బాధ్యతను మనం సక్రమంగా నిర్వర్తించడం వలన వస్తుంది. కానీ దీనిని అనేకులు గుర్తించక, దగ్గర దారులను వెతుక్కుంటున్నారు. నేటి దినములలో ఇటువంటి నైజము వ్యక్తులలోనే కాక, సంస్థలలోనూ కనబడుచున్నది. వార్తలను ప్రచురించే టి.వి. ఛానల్స్ చూస్తే గుర్తింపు కొరకు ఎన్నో అవాస్తవములను వాస్తవములుగా చూపిస్తూ ఉంటారు. ఏదైనా ప్రమాదం జరిగితే సరిగా విషయము తెలుసుకోకుండా, అంతమంది చనిపోయారు, ఇంతమంది చనిపోయారు అని ప్రకటిస్తూ ఉంటారు. ఇదంతా కేవలం అందరి దృష్టిలోనూ ముందుగా ప్రకటించాము అని గుర్తింపు పొందుట కొరకే. ఈ విధంగా వ్యవస్థలో అనేక విధములుగా గుర్తింపు కొరకు ప్రాకులాడి, వారు నష్టపోతూ, అనేకులను నష్టపరుస్తూ ఉంటారు. తద్వారా ప్రశాంతమైన జీవితమును పోగొట్టుకుంటారు.

**6. అసూయపడవద్దు :-**

అసూయ అనగా ఎదుటి వారి గుణముల మీద దోషం ఆరోపించుట. తోటి వారి స్థితిని సహించుకోలేకపోవడం అసూయ పడడం అవుతుంది. అనేకసార్లు మన తోటి వారిని, మన కంటే తక్కువ స్థితిలో ఉన్నవారిని, మన కంటే మెరుగైన స్థితిలో చూడలేక పోవడం జరుగుతుంది. కాని మనం ఎవరి యెడల అసూయ పడినప్పటికి ఎటువంటి లాభమును పొందలేము. లాభమును పొందకపోగా మన హృదయంలో ఒక విధమైన ఒత్తిడి ప్రారంభమవుతుంది. అది మనకి ఎంతో నష్టమును కలిగిస్తుంది. అసూయ కలగడానికి కారణం మనలను ఇతరులతో పోల్చుకొనుట. చరిత్రలో ఏ ఇద్దరు వ్యక్తులు ఒకే విధంగా ఉండలేరు, భవిష్యత్‌లో కూడా ఉండబోరు. కాబట్టి పోల్చుకొనుటకు అర్థం లేదు.

ఉదాహరణకు ఒక వ్యక్తికి దేవుడు కనబడి, నీకు మూడు వరములు ఇవ్వాలని తలంచాను, ఏమి కావాలో కోరుకో, అయితే నువ్వు ఏది కోరుకున్ననూ, నీకు అవి

కలుగుతాయి, నీ ప్రక్కన వ్యక్తి కూడా  వాటిని రెట్టింపుగా పొందుకుంటాడు అని చెప్పాడు. వెంటనే ఆ వ్యక్తి మొదట నాకు 1000 గొర్రెలు కావాలి అని అడిగాడు. అవి కలిగినప్పుడు అతను ఎంతో సంతోషించాడు. ప్రక్క వ్యక్తికి 2000 గొర్రెలు కలిగాయి. సంతోషంగా ఉన్న మొదటి వ్యక్తి మొఖం మాడిపోయింది. మరల మొదటి వ్యక్తి  నాకు ఒక మగపిల్లవాడు కావాలి అని కోరుకొని, అతనికి కలిగినప్పుడు సంతోషించాడు. ప్రక్క వ్యక్తికి కవలపిల్లలు కలిగేటప్పటికి మొదటి వ్యక్తి సంతోషమంతా ఆవిరైపోయింది. ఇదంతా చూచిన మొదటి వ్యక్తి నేను ఏది కోరుకుంటే దానికి రెట్టింపు ప్రక్కనతనికి కలుగుతుంది అని నాకు ఒక కన్ను పోవాలి అని అడిగితే ప్రక్కనతనికి రెండు  కళ్ళు పోతాయి కదా అనే ఆలోచనతో ఒక కన్నును పోగొట్టుకోవడానికి ఇష్టపడ్డాడు.

చూశారా ! ఆ వ్యక్తి తన జీవితంలో కోరినవి పొందినందుకు ఎంతో సంతోషించాడు కానీ వాటినే ప్రక్క వ్యక్తికి కలిగేటప్పటికి తన సంతోషమంతటిని కోల్పోయి, హృదయంలో అసూయ పడుచున్నాడు. ఈ అసూయ జీవితంలో విచక్షణని కోల్పోయేలా చేసి, ప్రక్కవారు మాత్రం బాగుపడకూడదు అనే ఆలోచనా విధానములోనికి నెట్టివేసి, ప్రశాంతమైన జీవితమునకు భంగమును కలిగిస్తుంది. కాబట్టి అసూయ లేకుండా జీవించుట ద్వారా ప్రశాంతమైన జీవితమును కాపాడుకోగలము.

**7. శక్తికి మించిన బాధ్యతలను స్వీకరించవద్దు :-**

ఈ దినములలో ఎంతోమంది శక్తికి మించిన బాధ్యతలు నెత్తి మీద వేసుకొని వాటిని సరిగా నెరవేర్చలేక సతమతమవుతూ ఉంటారు. అప్పుడు ఏ ఒక్క బాధ్యతను సరిగా నిర్వర్తించలేకపోతారు. వారు చేయవలసిన పనులన్నిటిని అసంపూర్తిగా చేసి, భరించలేనంత టెన్షన్ తెచ్చిపెట్టుకుంటారు. ఉదాహరణకి ఒక వ్యక్తి తన కుటుంబమును పోషించుకోవడానికి ఒక ఉద్యోగం చేస్తూ ఉండేవాడు. ఉద్యోగంలో నమ్మకస్తుడిగా పేరు సంపాదించడం జరిగింది. చాలా సంతోషంగా ఆ కుటుంబం సాగిపోతూ ఉండేది. ఎన్నడూ ఏదీ తక్కువ కాలేదు. ఒక రాత్రి ఆ వ్యక్తి ఒంటరిగా కూర్చుని ఈ ఉద్యోగం చేస్తుంటే, వచ్చినవి వచ్చినట్లు సరిపోతున్నాయి, ఏం చేయాలా? అని ఆలోచించాడు. మనసుకి ఒక ఆలోచన తట్టింది. వడ్డీ వ్యాపారం చేస్తాను, దీనిలో వచ్చే డబ్బు అంతా మిగులుతుంది, ఉద్యోగంలో వచ్చిన జీతం కుటుంబము యొక్క పోషణకి సరిపోతుంది అని అనుకున్నాడు. కొంతకాలం తరువాత వడ్డీ వ్యాపారమునకు, ఉద్యోగమునకు రెండింటికి న్యాయం చేయలేక, ఉద్యోగంలో ఉన్న నమ్మకత్వమును పోగొట్టుకున్నాడు. అందువలన కొన్నిదినములలోనే ఉద్యోగము నుండి తొలగించబడ్డాడు. దీనంతటి వలన మొదట అతడు కలిగియున్న ప్రశాంతమైన జీవితమునకు దూరమయ్యాడు. కావున శక్తికి మించిన బాధ్యతలతో ప్రశాంతమైన జీవితమును కోల్పోవద్దు.



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**– సీరియల్ 12వ భాగము**

తమ సింగ్‌ల ఆవరణములలో జరిగే రీతిగానే ఇక్కడా జరుగుచున్నది. దైనందిన కార్యక్రమం అక్కడున్నట్లుగా ఇక్కడ కూడా సుళువైన పద్ధతులతో స్వేచ్ఛగా ఉన్నది. అయితే అచ్చట రావడం, పోవడం, సరదాగా కబుర్లు చెప్పుకోవడం, లేదంటే దెబ్బలాడుకోవడం జరుగుచుండేది. ఇలాంటి స్థితిలో వారి మధ్య నుండి నెమ్మదిగా జారుకొని ప్రార్థించుకోవడానికి గాని, ధ్యానం చేసుకోవడానికి గాని, బైబిలు చదువుకోవడానికి గాని సమయం దొరుకుచుండేది. అయితే ఇచ్చట స్కూల్లో పరిస్థితి ఎంతో భిన్నంగా ఉంది. పాఠాలకు, వినోదానికి, భోజనమునకు, ఆటలకు, ఆరాధనకు ప్రత్యేక సమయాలు కేటాయించి నియంత్రించిన జీవితం సుందర్ మానసిక ప్రవృత్తికి భిన్నంగా ఉండింది. అయితే ఎలాంటి గొడవలు చెయ్యకుండా అచ్చటి పద్ధతులకు తనను తాను అలవర్చుకొన్నప్పటికిని సుందర్ మనస్సులో నెమ్మది లేకుండా పోయింది. ఇప్పుడేమో తండ్రి వచ్చి క్రైస్తవుడయ్యే ఆలోచన మానుకొని ఇంటికి రమ్మని కన్నీళ్ళతో బ్రతిమాలుచున్నాడు. అంతకు ముందెన్నడు లేనంతగా లొంగిపోయే స్థితికి వచ్చాడు సుందర్. తల్లి ప్రేమను, ఆమె భక్తి వైరాగ్యములను తండ్రి గుర్తు చేస్తున్నప్పుడు సంతోషకరమైన బాల్యస్మృతులతో సుందర్ కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. తన కుటుంబం చూపిన ప్రేమను భద్రతను ఎలా కాదనగలడు ! ఇంతగా ఏడ్చుచున్న తండ్రి ప్రేమ సుందర్ పై ఎంతో బలంగా పని చేయనారంభించింది. అయితే తండ్రికి జవాబివ్వడానికి తటపటాయిస్తున్న సమయంలో ఇంతకంటే బలమైనది మరొకటుందని గుర్తించాడు సుందర్. తనకు కలిగిన క్రీస్తు దర్శనమింకా మనస్సులో నుండి కనబడుచునే యున్నది. "నేను క్రైస్తవుడ్ని, ఎన్నటెన్నటికి క్రైస్తవునిగానే ఉండిపోవాలని కోరుచున్నాను, నేను రాలేను" అని గద్గద స్వరంతో తండ్రికి జవాబిచ్చాడు. ఈ తీర్మానాన్ని విన్న సుందర్ తండ్రి పెల్లుబికి వస్తున్న దుఃఖాన్ని దిగమ్రింగుకొని ఎంతో కోపోద్రిక్తుడై వెళ్ళిపోయాడు. కొద్దిరోజుల తరువాత కొందరు బంధువులు గుంపుగా స్కూలుకి రావడంతో వారు లోపలకు వెళ్ళి సుందర్‌ని పట్టుకొనకుండా బలవంతంగా వారిని ఆపవలసి వచ్చింది. శెలవులకు ముందే రెండుసార్లు ఇలా జరిగింది. దీనితో శెలవులలో సుందర్‌ని ఎక్కడికి పంపించాలా అని మిషనెరీలు ఆలోచించసాగారు. సిక్కు తీవ్రవాదుల చేతిలో పడకుండ రాంపూర్‌కి ఎంతో దూర ప్రాంతంలో సుందర్‌ని జాగ్రత్తగా చూచుకునే చోటుకు

పంపించాలను కున్నారు. చివరికి సబాతుకు పంపిస్తే బాగుంటుందనే నిర్ణయానికి వచ్చారు.

సిమ్లా నగరానికి ఇరవై మైళ్ళ దూరంలో నున్న ఓ చిన్న పట్టణం సబాతు అమెరికన్ ప్రెస్బిటరీ మిషన్ వారు కుష్ఠరోగుల చికిత్స కోసం అక్కడ ఆసుపత్రిని స్థాపించారు. ఆ ఆసుపత్రిలో పని చేసే వారి మధ్యనే సుందర్‌కి ఒక స్థలం చూపవచ్చుననుకున్నారు. ఇప్పటికే సుందర్ కథ ఎందరికో తెలిసిపోతూ ఉంది. మిషనెరీలు అతని గూర్చి ప్రత్యేకమైన శ్రద్ధ వహించారు. తానేం చేయాలో తనంత తానుగా నిర్ణయించుకోగలిగే ఆ 16 ఏండ్ల వయస్సు వచ్చేవరకు సుందర్‌ని అక్కడే ఉంచాలనుకున్నారు. సలహాలివ్వడం, కొన్ని నిర్ణయాలకు లోబడి రాబోయే దినాలలో సహాయ మందించడం జరుగుతుంది గాని చివరి నిర్ణయం సుందర్‌దే. అయితే అతనికి 16 ఏండ్లు నిండే వరకు అతని భవిష్యత్తుని నిర్ణయించే ఎలాంటి చర్య తీసుకునేది లేదు.

కాబట్టి సుందర్‌ని సబాతుకు పంపారు. చివరికి అంతరంగంలో శాంతిని మాత్రమే గాక వెలుపల కూడా ప్రశాంతతని అనుభవించాడు సుందర్. తన ఇంటి వారి వలననూ, వారి తిరస్కారము వలననూ వచ్చిన ఒత్తిడికి దూరంగాను, గట్టి క్రమశిక్షణతో నిర్వహించే స్కూలు వాతావరణానికి దూరంగాను ఉంటూ, మా మధ్యకెందుకు వచ్చావని ప్రశ్నించకుండ సంతోషంగా తమ పనులు తాము చేసికొనే వారి మధ్య తనకి ఇష్టమైన రీతిగా సమయాన్ని గడిపే ఈ స్థలమునకు వచ్చాడు. గత నెలల్లో తాను అనుభవించిన ఆందోళన నుండి విడుదల పొంది, ఇక్కడ ఉన్న కొద్ది వారాలలో విశ్రాంతిని, నూతన ఉత్తేజాన్ని పొందాడు. చిన్నతనంలో వృద్ధ సాధు దగ్గరికి తన తల్లి తనను తీసుకొనిపోవుచున్న దినములలో ప్రశాంతంగా ఉన్న అడవులలో ఏకాంతంగా గడపాలని ఆశించేవాడు సుందర్. ఇప్పుడు తాను ఉన్న ఆసుపత్రి అచటి పైన్ అడవుల ప్రక్కనే ఉండడంతో చిన్ననాటి కోరిక తీరినట్లయ్యింది సుందర్‌కి. ఆ అడవులలో తన ఇష్టానుసారంగా తిరుగుచూ బైబిలు చదువుకునేవాడు. అదృశ్యుడైన వానిని లేదా అదృశ్యమైన దానిని చూడాలన్న వాంఛ ఆ సాధులోను, తన తల్లిలోను, తనలోనూ ఉంది. కానీ వారికి తనకు తేడా ఉంది. వారు వెదుకుచుండిన శాంతిని తాను పొందాడు. ఆ అదృశ్యుడైన వానిని తాను చూచాడు, తానాయనను తెలిసికొన్నాడు గాని మరింతగా తెలుసుకోవాలని వాంఛిస్తున్నాడు. పక్షుల కిలకిలా రావములు, కలుపు మొక్కల మధ్య తిరుగాడే చిన్న చిన్న పురుగుల ధ్వని తప్ప ఎంతో ప్రశాంతంగా ఉన్న ఆ అడవిలో ఏదో ఒక చెట్టు నానుకొని కూర్చుని బైబిలు చదువుచూ, చదివిన దాన్ని ధ్యానిస్తూ ఆ వాక్యాన్ని తన హృదయం మీద లోతైన ప్రభావం చూపనిచ్చాడు సుందర్.

– సేకరించబడినది. –(ఇంకా వుంది)



# మంచి ఫాదర్

పిల్లలూ బావున్నారా? మీ ఆరోగ్యం ఎలా ఉంది? ఈ సీజన్‌లో వర్షాలు బాగా పడుతున్నాయి, మీకు వర్షంలో తడవటం ఇష్టం కదా, మీ parents, మీరు తడవకుండా ఉండాలని ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటారు. మీరేమో వాళ్ళ మాట వినరు. అనేకసార్లు వాళ్ళు చెప్పేవి అన్నీ మీ మంచికే. ఇప్పుడు మీరు teachers, parents చెప్పినట్లు వింటే పెద్దయ్యాక మంచి వ్యక్తిత్వం కలిగినవారుగా తీర్చిదిద్దబడతారు. వారిని బాధపెట్టకండి, కొంతమంది పిల్లలకి సరియైన మార్గం చూపించే వారు లేక చెడ్డవారుగా తయారవుతున్నారు.

జార్జ్ అనే బాలుడు తన తల్లిదండ్రులను పోగొట్టుకొని అనాథ అయ్యాడు. 12 సం॥ల వయస్సులోనే అల్లరి మూకలకు నాయకుడిగా ఎదిగాడు. అతని గ్రూప్‌లోని పిల్లలందరూ జార్జ్ కంటే వయస్సులో పెద్దవారు. 16 సం॥ల పిల్లలు కూడా జార్జ్‌ని తమ నాయకునిగా అంగీకరించారు. జార్జ్ హత్యలు చేసేవాడు, చిన్న pistolతో మిఠాయి దుకాణాలను బెదిరించి దోచుకునేవాడు, ఒంటరిగా ఒక బ్యాంకును కొల్లగొట్టి లక్షలాది రూపాయలు సంపాదించాడు, ఒక మారు ఒక ముసలమ్మను చంపేందుకు pistol సర్దుకుంటుండగా పోలీసులకు చిక్కాడు. బాలనేరస్థుల cell లో అతనిని వేశారు. అక్కడి పిల్లలకి ఒక school, hostel వసతులు కలవు. ఆండ్రూస్ అనే ఫాదర్ అక్కడి పిల్లలకి మంచి మాటలు చెప్పి, వారి చెడ్డ ప్రవర్తనను మార్చుకోడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చేవాడు. జార్జ్‌కి పోలీసుల భయంలేదు, ఇష్టం వచ్చినట్లు తిరిగేవాడు, తన దర్పాన్ని చూపేవాడు, దొరికిన వస్తువులన్నీ చెల్లాచెదురుగా విసిరివేసేవాడు. తరగతిలోని విద్యార్థులను తిడుతుండేవాడు. తోటి విద్యార్థులు గంటల తరబడి శ్రమించి చేసిన మంచి పనులను నిమిషంలో పాడుచేసేవాడు. వీటన్నిటిని ఆ ఫాదర్ ఎంతో ఓరిమితో సహిస్తూ ఉండేవాడు. స్కూల్లో చేరిన 6 నెలలు జార్జ్ ముఖంలో చిరునవ్వు కానీ, కన్నీరు కానీ ఎవ్వరూ చూడలేదు.

ఈ విధంగా నిలువెల్ల ద్వేషాన్ని పెంచుకున్న జార్జ్‌తో school లోని teachers అందరూ విసుగెత్తిపోయారు. వారు ఫాదర్‌తో జార్జ్ గురించి “ఫాదర్‌గారు మీరు ప్రపంచంలో చెడ్డవారు ఎవరూ ఉండరని చెబుతారు కదా మరి జార్జ్ చెడ్డవాడు కాదంటారా? మీరు అతని గూర్చి ఏమి చెబుతారు?” అని అడిగారు. ఫాదర్ మౌనంగా ఉన్నాడు.

ఒక రాత్రి జార్జ్ నిద్రలో కలవరిస్తున్నాడు, ఫాదర్ అతన్ని చూశాడు. తీవ్రమైన

జ్వరంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్నాడు. జార్జ్ దుష్ట స్వభావంతో హింసించిన తోటి విద్యార్థులు, అతనికి సేవ చేసి కంటికి రెప్పలా కాపాడారు. జార్జ్ తొందరగానే కోలుకున్నాడు. కానీ అతని ముఖంలో కృతజ్ఞతకు సూచనగా ఒక్క చిరునవ్వు కూడా మినుక్కుమనలేదు. ఒకరోజు జార్జ్ నేరుగా ఫాదర్ దగ్గరకు వెళ్ళి "మీరు నన్ను మంచివాడిగా మార్చాలని ప్రయత్నిస్తున్నారు", అది ఎంత వరకు సాధ్యం. ఇంతకు ముందే నేను ఒక సిస్టర్‌ని కొట్టి వచ్చాను. దానికి మీరేమంటారు? అని అడిగాడు. ఇప్పటికీ చెబుతున్నాను నీవు మంచి బాలుడివే అని దృఢంగా చెప్పాడు ఫాదర్. నేను మంచివాడిని కాదని మీకు బాగా తెలుసు, కానీ మంచి వాడినని అబద్ధం చెబుతున్నారు. ఫాదర్ ఒక్క క్షణం ఆలోచించి మంచి బాలుడు ఎలా ఉంటాడు? పెద్దల పట్ల విధేయుడిగా, ఉపాధ్యాయులు చెప్పినట్లు వింటాడు కదా అన్నాడు ఫాదర్. అవును అన్నాడు జార్జ్.

నువ్వు మొదట పెరిగిన పరిస్థితులు, నీతో స్నేహం చేసే తుంటరి పిల్లలు నీకు మాదిరిగా ఉండుట ద్వారా, చెడు మార్గములను అనుసరిస్తూ, చెడు చేయటమే గొప్ప విజయము అనుకున్నావు. ఇప్పుడు ఇక్కడ మంచి పిల్లలతో స్నేహం చేస్తూ, ఉపాధ్యాయులకి విధేయుడిగా జీవిస్తే, అత్యుత్తమ వ్యక్తివి కాగలవు అన్నారు ఫాదర్. ఈ మాట అతని మనస్సులో చెరగని ముద్ర వేసింది. ఫాదర్ మాట వాస్తవమనిపించింది. చెడ్డవాడ్ని అని అతనిలో నాటుకున్న నమ్మకమును తొలగించింది. కొన్ని దినములలోనే జార్జ్ పరీక్షల్లో మొదటి స్థానాన్ని సంపాదించాడు. సైన్యంలో చేరి, యుద్ధంలో పాల్గొని చాలా పతకాలు అందుకున్నాడు. మంచి వ్యక్తిగా పేరుగాంచాడు.

ఈ రోజుల్లో సమాజానికి కావలసింది ఒక రెవరెండ్, బిషప్, పాస్టరు కాదు, ఫాదర్ ఆండ్రూస్ లాంటి వ్యక్తి. చూశారా పిల్లలూ! ఏ ఒక్కరినీ దేవుడు చెడ్డవారిగా సృష్టించడు. మన చుట్టూ ఉన్న పరిస్థితులను, మనుష్యులను బట్టి చెడ్డ వారిగా మారుతూ ఉంటాము. జార్జ్ పరిస్థితుల నుండి బయటికి రావడానికి చాలా time పట్టింది. కాబట్టి మీరు అటువంటి పరిస్థితులు రానీయక మీ పెద్దవారు చెప్పినట్లుగా వినండి, బాగా చదువుకోండి. మంచి పిల్లలుగా పేరు తెచ్చుకుంటారుగా ..........

God bless you.

- మీ అక్కయ్య

# “నా జీవితములో దేవుని మేలులు”

- జయరాజు

ప్రియమైన స్పర్శ పాఠకులకు నా జీవిత సాక్ష్యమును మీ అందరితో పంచుకునే ధన్యతను అనుగ్రహించిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచున్నాను. మీ అందరికి ప్రత్యేకమైన వందనములు తెలుపుకుంటున్నాను.

జయరాజు అను నేను పశ్చిమగోదావరి జిల్లా, పాలకొల్లు దగ్గర కాజ అనే గ్రామంలో అన్యజనుల కుటుంబములో పుట్టితిని. నాకు ఒక అన్నయ్య. తరువాత నా తల్లి ప్రభువుని తెలుసుకుంది. నా తల్లి ప్రార్థనకి వెళ్ళేటప్పుడు నేను ఆమెతో వెళ్ళేవాడిని కానీ ఎందుకు వెళ్తున్నానో తెలిసేది కాదు. యౌవనకాలంలో నాకు విపరీతమైన కోపం ఉండేది. అది ఎంతగా అంటే ఒకరోజు కోపంతో నా తల్లిని కొట్టడం కూడా జరిగింది. నా వలన వారికి సంతోషం అనేది లేక, వీడిని ఎందుకు కన్నామా? అని బాధపడేవారు. నేను ఇంటర్ వరకు చదువుకోడం జరిగింది. తరువాత చిన్నాన్నగారి కూల్‌డ్రింక్స్ షాపులో పనిచేసేవాడిని. 2004 వ సం॥లో ఉద్యోగ నిమిత్తం హైదరాబాద్‌కి రావడం జరిగింది. జీడిమెట్లలోని ఇండస్ట్రీలో పనిచేస్తుండగా ఒక అక్క పరిచయమయ్యింది. పదే పదే ప్రార్థనా మందిరమునకు రమ్మని అడుగుతూ ఉండేది. ఏవేవో అబద్ధములు చెప్పి, ఎప్పటి కప్పుడు తప్పించుకుంటూ ఉండే వాడిని. ఒక గుడ్‌ఫ్రైడే దినమున మందిరమునకు తీసుకురావడం జరిగింది. ఆ రోజు ఎపఫ్రా అన్నయ్య వాక్యము చెబుతూ “యూదులు యేసుక్రీస్తుని దేవుడు అని తెలియక సిలువ వేశారు, కానీ నీవు తెలిసి సిలువ వేస్తున్నావు” అని చెప్పడం జరిగింది. ఆ వాక్యం నా హృదయమునకు తాకింది. అప్పటి నుండి దేవుని మందిరమునకు వెళ్ళాలనే ఆశ కలిగి, క్రమంగా మందిరమునకు వెళ్ళేవాడిని.


ఆగస్టు నెలలో ఆయనే నిజదేవుడని నమ్మి, పాపములను ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తం బాప్తిస్మం తీసుకోవడం జరిగింది. కొన్ని దినములు అయిన తరువాత యాక్సిస్ బ్యాంక్‌లో జాబ్ వచ్చింది. సంవత్సరములు జరుగుచుండగా నా తండ్రికి గుండె ఆపరేషన్ చేయవలసి వచ్చింది. ఆపరేషన్ చేయకపోతే చనిపోతారు అని చెప్పారు. కానీ ఆ సమయంలో 2 లక్షలు కావాలి. అయితే మా దగ్గర అంత డబ్బు లేదు. ఉపవాస ప్రార్థనలో సంఘస్థులు ప్రార్థన చేయుట ద్వారా దేవుడు అద్భుత రీతిగా సహాయం చేసి, ఆపరేషన్ జరిగించి, నా తండ్రిని బ్రతికించారు.

ఈ విధంగా ఉన్నప్పుడు నా తల్లిదండ్రులు వివాహం కొరకు ప్రయత్నిస్తున్నప్పుడు, పరిచర్యలో ఉన్న పెద్ద అన్నయ్యలతో చెప్పడం జరిగింది. వారు దైవసేవకులను సంప్రదించి

దైవభయం కలిగిన అమ్మాయితో నాకు వివాహం నిశ్చయించి, జరిపించారు. వారి నుండి ఏమీ ఆశించని మనస్సు ఇచ్చిన దేవునికి స్తోత్రం.

ఈ మధ్య ఒక రోడ్ ప్రమాదంలో దేవుడు నన్ను ప్రాణాపాయకరమైన స్థితిలోనికి వెళ్ళకుండా, సజీవుల లెక్కలో నిలిపి ఉంచారు. ఆర్థిక విషయములలో దేవుడు సహాయం చేస్తూ, ఏదీ తక్కువ కానివ్వలేదు. కుటుంబమంతటికి ఆరోగ్యము, శాంతి, సమాధానము అనుగ్రహించి నడిపిస్తున్న దేవునికి కృతజ్ఞతాస్తుతులు.

నేను, నా కుటుంబము చివరి శ్వాస వరకు దేవునిలో నిలిచి ఉండాలని, మా కొరకు ప్రార్థన చేయవలసిందిగా కోరుచున్నాను.



# ఇది తెలుసా?



అబ్రహాం లింకన్ అమెరికా ప్రెసిడెంట్ గా 1986 సం.లో ఎన్నికైనారు. ప్రెసిడెంట్ అయిన ప్రారంభ దినములలో అమెరికాలోని ధనవంతులు, వ్యాపార వేత్తలు లోలోపల లింకన్ పట్ల హేయభావం కలిగి ఉండేవారు. ఒకరోజు సెనెట్‌లో ప్రసంగిస్తూ ఉండగా అక్కడున్న ధన వంతుల్లో ఒక వ్యక్తి లేచి ఏయ్ లింకన్... నువ్వేదో ప్రెసిండెంట్ అయ్యానని గొప్ప వాడవనుకోకు మీ నాన్న మా ఇంటి వాళ్ళందరికీ చెప్పులు కుట్టేవాడు అంటూ తన కాలు బూటును తీసి పైకి చూపిస్తూ, ఈ బూటును మీ నాన్న కుట్టాడు అని గట్టిగా అరుస్తూ హేళన చేసాడు. సెనెట్‌లో వారందరూ గొల్లున నవ్వారు. లింకన్ కళ్ళలో నీళ్లు తిరిగాయి. తన ప్రసంగాన్ని ఒక్క క్షణం ఆపి, ఈ సమయంలో మా నాన్నను గుర్తు చేసినందుకు మీకెంతో ధన్యవాదములు. మా నాన్న తన వృత్తిలో ఎంతో ప్రావీణ్యత కలిగి మంచి పేరు సంపాదించుకున్నాడు. నేను కూడా నా పనిలో అంత ప్రావీణ్యత కలిగి ఉండడానికి ప్రయత్నిస్తాను.

ఇక్కడ ఒక పెద్దమనిషి లేచి వాళ్ళ కుటుంబానికి మా నాన్న చెప్పులు కుట్టేవాడు అని చెప్పాడు. వాళ్ళకే కాక అనేక మంది ధనవంతుల కుటుంబాలకు చెప్పులు కుట్టాడు. మా నాన్న వారసత్వముగా పనిలో నైపుణ్యాన్ని నాకు కూడా కొంత ఇచ్చాడు. మా నాన్న తయారుచేసిన చెప్పులు మీకు నొప్పిగాని, ఇబ్బందిగాని కలిగిస్తే నేను వాటిని సరిచేసి ఇస్తాను. దయచేసి నాకు వాటిని ఇవ్వండి అని, నేను నాకు తెలిసిన ఏ పనినైనా చేయడానికి సిగ్గుపడను అని ముగించడాడు. సెనెట్‌లో ఉన్నవారందరూ ఒక్కసారి నిచ్చేష్టులైనారు. కారణం లింకన్‌ను అవమానపరచాలని చూచి విఫలం అవ్వడం.




# ఆత్మ ఫలము - 10వ భాగము

- ఎడిటర్

**ఆత్మఫలమేమనగా ప్రేమ, సంతోషము, సమాధానము, దీర్ఘశాంతము, దయాళుత్వము, మంచితనము, విశ్వాసము, సాత్వికము, ఆశానిగ్రహము.**

**ఆత్మఫలములో ఏడవది విశ్వాసము (నమ్మకత్వము)**

ఆత్మఫలములో విశ్వాసం అనే దానిని నమ్మకత్వముగా చెప్పుకోవచ్చును. అప్పగింపబడిన పని మీద ముగింపు వరకు స్థిరమైన శ్రద్ధ కలిగి ఉండుట ఆ పని యెడల నమ్మకత్వం కలిగి ఉన్నట్లు. నమ్మకస్తులుగా తమ్ముని తాము ఋజువు చేసుకున్న వారిని దేవుడు అభివృద్ధి పరుస్తారు. నమ్మదగిన వ్యక్తులుగా ఒకరికి మనం ఉండటం ఎంతో విలువైనది. నమ్మకత్వం కలిగి యుండుట భూమి మీద ధన సంపదలు కలిగి ఉండుట కంటే శ్రేష్ఠమైనది. ఈ రోజున సమాజం నమ్మకస్తులైన వారి కొరకు ఎదురుచూస్తుంది. తమ వ్యాపారమును అభివృద్ధి పరచుట కొరకు వ్యాపార సంస్థలు, అప్పులు ఇచ్చుటకు బ్యాంకులు నమ్మకస్తులైన వారిని గుర్తించుటకు ఎంతో కష్టపడుతున్నప్పటికి, ఆ పని సఫలం కావట్లేదు. బ్యాంకులలో అప్పులు తీసుకున్న వారు నమ్మకంగా తిరిగి చెల్లించక పోవడం వలన కొన్ని సంవత్సరముల క్రితం విదేశాలలో ప్రఖ్యాతి గాంచిన బ్యాంకులు మూతపడడం మనకి తెలిసిన విషయమే.

క్రీస్తుని ఎరిగిన వారికి సైతం సువార్తను ప్రకటించుటకు, మరియు కొందరిని తమ సంఘములో చేర్చుకొనుటకు ఉన్న శ్రద్ధ, నమ్మకంగా మనుష్యులకు మేలు చేయడంలో కనబడదు. దేవునికి కావలసినది మనము నమ్మకమైన వారిగా ఉండుట అనగా నమ్మకత్వము అనే ఆత్మీయ ఫలమును ఫలించుట. నమ్మదగిన వారిగా ఉండటానికి మనం మన భావోద్రేకముల ద్వారా నడిపించబడకూడదు. ఊహించే వాటికి, తలంచే దానికి లేక కోరుకునే వాటికి అతీతంగా మనం వ్యవహరించవలసి ఉంటుంది. నమ్మకత్వం కలిగి ఉండుట అనగా చెప్పిన చోటికి, చెప్పిన సమయమునకు చేరుకోవడం, చేస్తానని మాట ఇచ్చిన సహాయం తప్పక చేసే వారై యుండుట.

కొన్ని నిర్ణయములు చిన్నవి కావచ్చు, కొన్ని జీవితాంతం ఉండే నిర్ణయములుగా ఉండవచ్చు. ఏదైనప్పటికి, ప్రతి నిర్ణయంలోనూ స్థిరత్వం కనపరిచి,తద్వారా నమ్మకస్తులుగా ఉండాలి. అనేక మంది ప్రజలు తమ జీవితంలో అభివృద్ధిని కావాలని కోరుకుంటారు, కానీ నమ్మకంగా ఉండుటకు ఇష్టపడరు. మరికొంత మంది ప్రజలు వారు అనుకున్న సమయంలో అభివృద్ధిని సాధించకపోతే వేరొకచోట అభివృద్ధిని సాధిస్తామనే ఉద్దేశ్యంతో నూతన స్థలంలో

మరియొక క్రొత్తపనిని చేయడానికి ప్రయత్నిస్తారు. దీని వలన స్థిరత్వం కోల్పోయి, ఎక్కడా నమ్మకంగా ఉండక, దేవుడు ఆశీర్వదించే అవకాశములను లేకుండా చేసుకుంటారు.

నమ్మకస్థులైన వారిని గురించి పరిశుద్ధ గ్రంథంలో అనేక ఉదాహరణలు ఉన్నాయి. దేవుని ఇల్లంతటిలో మోషే నమ్మకస్తుడిగా ఉన్నాడు అని దేవుడు చెప్పుచున్నాడు. దేవుడు అతనికి ఇచ్చిన విధులను నమ్మకంగా నిర్వర్తించాడు. మోషే తన సహోదరుడైన అహరోను, సహోదరి అయిన మిర్యాము తనకు వ్యతిరేకముగా మాట్లాడినప్పటికి వారిని ప్రేమించి, తద్వారా వారి పట్ల నమ్మకత్వమును ప్రదర్శించాడు. తన జీవితంలో ఎదురైన ప్రజలు అతనికి మేలు చేయకపోయినప్పటికి, వారందరి పట్ల నమ్మకత్వం ప్రదర్శిస్తూనే ఉన్నాడు. నమ్మకత్వం అనే ఫలం అభివృద్ధి చేసుకోవడం అనేది అంత సులువైన పని కాకపోయినప్పటికి, మీరు చేస్తున్న పనులన్నిటిలో దానిని అభివృద్ధి చేసుకుంటూనే ఉండండి. కొంచెములో నమ్మకముగా ఉండుము, అప్పుడు దేవుడు అనేకమైన వాటి మీద మిమ్మును నియమించును. (మత్తయి 25:21,23) దేవుడు మిమ్మును ఉన్నత స్థితికి తీసుకువెళ్ళు చున్నప్పుడు ఎవ్వరు (లేదా) ఏ పరిస్థితి దాని నుండి మిమ్ములను దూరం చేయలేవు. దేవుడు ఉద్దేశించిన శ్రేష్ఠమైన జీవితమునకు మీ నమ్మకత్వం నడిపించును గాక !

- (ఇంకావుంది)


రండి! పాల్గొనండి!! ఆశీర్వాదం పొందండి !!!

**2010 అక్టోబర్ 2వ తేది ఉపవాస ప్రార్థన**

**దేశ క్షేమం, క్రైస్తవ సంఘాల ఉజ్జీవం,**
**కుటుంబముల ఆశీర్వాదము కొరకు దేవునిని వేడుకుందాం.**

**సమయం:** ఉదయం గం. 9.00 లకు
వివరములకు: బ్రదర్. రవీందర్, సెల్: 99631 17628

# కరుడు కట్టిన క్రైస్తవ్యం

కరుడు కట్టిన అనే పదమును సాధారణముగా తీవ్రవాదుల విషయములో వింటూ ఉంటాము. కానీ ఈ చివరి దినములలో క్రైస్తవ్యం విషయములో కూడా అన్వయించుకోవలసి వస్తుంది. కృప ద్వారా అనగా అర్హత లేకుండా మనము పాపము నుండి విడిపించబడి క్రీస్తు ప్రేమను బట్టి  కొన్ని వాక్యములు నేర్చుకొనగానే లేక కొన్ని దినములు దేవునిలో నడిచేసరికి కొందరి జీవితములో విపరీతమైన మనస్తత్వముతో జీవించడం కనబడుతుంది. ఇలాంటి స్వభావమును గమనించి, హెచ్చరించే కాపరులు కొందరైతే, మరి కొందరు మనకి ఎందుకులే అని విడిచిపెట్టేవారిగా ఉన్నారు. విశ్వాస జీవితం ప్రారంభంలోనే ఈ విధమైన క్రమశిక్షణ లేక పోవుట వలన రాన్రాను అంతా మాకే తెలుసు అనే విధంగా ప్రవర్తిస్తూ ఉంటారు. దీనినే కరుడు కట్టిన క్రైస్తవ్యం అంటారు.

**<u>కరుడు కట్టిన క్రైస్తవ్య పద్ధతులలో కొన్ని ఉదాహరణలను చూద్దాము :-</u>**


1. ఎవరు వాక్యమును బోధిస్తున్ననూ, దానిని విమర్శనాత్మకంగా చూస్తూ, అసందర్భ ప్రేలాపనలు చేయడం.
2. ఈ భూమి మీద నేను ఎవ్వరికి లోబడను, దేవునికి తప్ప అని తాము తప్ప నీతిమంతులు ఇంక ఎవ్వరూ లేరు అన్నట్లుగా మాట్లాడటం.
3. మన అనుదిన జీవితములో అవసరమైన అనేక విషయములు బైబిల్ గ్రంథములో దేవుడు  వ్రాయించినప్పటికి, ఏ విషయమునైననూ దేవుడు నాకు చెప్పాలి అనడం.
4. ప్రతి విషయము జరిగిపోయిన తరువాత, దీని గురించి దేవుడు నాకు ముందే చెప్పాడు అని ప్రకటించడం.
5. మన బాధ్యతను మనం నిర్వర్తించకుండా, దేవుడే చూచుకుంటాడు అని చెప్పుట.
6. సూక్ష్మ రంధ్రాన్వేషణ చేయడం అనగా మోటర్ సైకిల్‌కి పంక్చర్ ఎందుకు పడింది? ఇంట్లో బల్బు ఎందుకు మాడిపోయింది ? అని దీర్ఘాలోచనలో పడడం.
7. బలవంతంగా ఎదుటి వారితో భక్తి చేయించాలని ప్రయత్నించడం.
8. దేవుని సేవా బాధ్యతలను నిర్వర్తించుటలో లాభాపేక్షని కనపరుచుట.
9. దేవుని పేరు చెప్పి మనుష్యులను భయభ్రాంతులకు గురిచేయడం.
10. తమలో ఉన్న లోపములను కప్పిపుచ్చుకుంటూ, ఎదుటి వారిలోని లోపములను ఎత్తి చూపడం.



# హెర్మోను పర్వతం

హెర్మోను అనగా పరిశుద్ధమైనది అని అర్థము. ఈ పర్వతము ఎల్లప్పుడూ హిమము (మంచు)తో కప్పబడి ఉండును. సిరియాలోని పర్వత శిఖరములన్నిటిలో మిగుల ఎత్తయినది. ఇది సముద్ర మట్టమునకు 9050 అడుగులున్నది. అది లెబానోను పర్వత ప్రతి పంక్తికి దక్షిణమున నున్నది. పలెస్తీను యొక్క ఉత్తర సరిహద్దులలో ముఖ్యమైనది. దీనిని సీదోనీయులు శిర్యోను అనియు, అమోరీయులు శేనీరు అని పిలిచేవారు. సహోదరుల ఐక్యతను గురించి కీర్తనాకారుడైన దావీదు 133వ కీర్తనలో ఈ కొండ మీద నుండి పడు మంచుతో పోల్చాడు. దీనికి మూడు శిఖరములు గలవు.

యేసుక్రీస్తు శరీరధారిగా ఉన్న దినములలో ఆయన శిష్యులైన పేతురును , యాకోబును, యోహానును మాత్రము వెంట బెట్టుకొని యెత్తయిన ఒక కొండ మీదికి వారిని తోడుకొని పోయి, వారి యెదుట రూపాంతరము పొందెను. ఆయన వస్త్రములు ప్రకాశమానమైనవియు, మిగుల తెల్లనివియు ఆయెను. మరియు మోషేయు, ఏలీయాయు వారికి కనబడి యేసుతో మాటలాడుచుండిరి. అప్పుడు పేతురు నీకు ఒకటి, మోషేకు ఒకటి, ఏలీయాకు ఒకటి మూడు పర్ణశాలలు ఇక్కడ కట్టుదుమని చెప్పెను. అంతలో మేఘము ఒకటి వచ్చి వారిని కమ్మగా – ఈయన నా ప్రియ కుమారుడు, ఈయన మాట వినుడని యొక శబ్దము మేఘములో నుండి పుట్టెను. వెంటనే వారు చుట్టు చూచినప్పుడు, తమ యొద్ద నున్న యేసు తప్ప మరి ఎవరును వారికి కనబడలేరు. యేసుక్రీస్తు రూపాంతరము చెందినది హెర్మోను కొండ మీదనే అని అనేకులు తలంచుచున్నారు. ప్రస్తుతమున అరబ్బీయులు దీనిని జెబెల్ – ఎష్ – షైక్ ( Jabel - esh - sheikh = ప్రధాన పర్వతము ) అని పిలుతురు.




# బైబిల్ క్విజ్ -12

(పాత నిబంధనా గ్రంథంలో
26-30 పుస్తకములలో నుండి ఇవ్వబడినవి)

**ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయుడి.**

**1.** **పెనిమిటి పోయిన యౌవనురాలు గోనెపట్ట కట్టుకొని అంగలార్చునట్లు నీవు అంగలార్చుము. రిఫరెన్సు?**

**2.** **బెల్షస్సరు రాజుకి రెండవ దర్శనము ఏ పట్టణపు నగరులో కలిగెను?**

**3.** **మృతులకై విలాపము చేయక నిశ్శబ్దముగా నిట్టూర్పు విడువుము. రిఫరెన్సు?**

**4.** **లోరూహామా అను పేరుకు అర్థం ఏమిటి ?**

**5.** **కీడును ద్వేషించి మేలును ప్రేమించుచు గుమ్మములలో దేనిని స్థిరపరచమని యెహోవా సెలవిచ్చారు?**

**6.** **మీ కఱ్ఱులు చెడగొట్టి ఖడ్గములు చేయుడి, మీ పోటకత్తులు చెడగొట్టి ఈటెలు చేయుడి. రిఫరెన్సు?**

**7.** **నేను ప్రవక్తనైనను కాను, ప్రవక్త శిష్యుడనైనను కాను, కాని పశుల కాపరినై మేడిపండ్లు ఏరుకొనువాడను అని ఎవరు ఎవరితో అన్నారు?**

**8.** **తమ కడుపు నింపుకొను ఇశ్రాయేలీయుల కాపరులకు శ్రమ. కాపరులు గొఱ్ఱెలను మేపవలెను గదా. రిఫరెన్సు?**

**9.** **ఏ పట్టణములో నరహంతకుల అడుగుజాడలు కనబడుచున్నవి?**

**10.** **దర్యావేషు ఎంతమందిని తన రాజ్యమునకు అధిపతులుగా నియమించుటకు ఇష్టపడ్డారు?**

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15 తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా :- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**<u>బైబిల్ క్విజ్ - 11 జవాబులు :</u>**

**1.** యెషయా 30:1 **2.** పరమగీతము 8:6 **3.** ప్రసంగి 9:4 **4.** యిర్మియా 33:6
**5.** పరమగీతము 2:2 **6.** విలాప వా॥ 2:19 **7.** యిర్మియా 39:18 **8.** ప్రసంగి 10:18
**9.** యెషయా 37:34 **10.** విలాప వా॥ 5:16

**<u>బైబిల్ క్విజ్ - 11 ప్రశ్నలకు సరియైన జవాబులు వ్రాసి పంపిన వారి పేర్లు :</u>**

వి.రాణి, కె.విజయ, సి.హెచ్.పాల్‌రాజు, సౌజన్య, జె.రాజ్యం, యం.విజయ, ఎ.కృష్ణకుమారి, కె.పార్వతి.

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత :** సందీప్, ఇందిరా ప్రియ, ఐజాక్, ప్రసాద్, జ్యోతి, ప్రియాంక, సుధ, శ్రీలక్ష్మి, షాలేం, కిరణ్ కుమార్, మాధురి, ప్రేమ్‌కుమార్, దీవెన, చెన్నకేశవరెడ్డి, ప్రదీప్‌కుమార్, స్వరూప్, అరుణ, హోసన్న,రాణి, శేఖర్, ప్రజ్ఞ, అనిత, అన్నపూర్ణ, ప్రీతి, నిర్మల, ఉషారాణి, ఫిలిప్పు, సాల్మన్‌రాజు, మాధవి, హోసన్న, శామ్సన్, ఏసుబాబు, దీపిక, షారోను, ప్రియదర్శిని, సూర్యరాజు, మల్లేశ్వరి, రవికుమార్ (మిర్యాలగూడ), సైమండ్, సుధారాణి, ప్రణీత్‌కుమార్, ప్రసన్నకుమార్

**చింతల్ :** జయరాజ్, జయమ్మ, సుధాకర్, సోమరాజు, ప్రసాద్, శ్యామ్ శేఖర్, కళ్యాణ్, కృష్ణవేణి, ఎఫ్రాయిము, రాజేష్, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్, త్రిమూర్తులు, భవాని, రాజు, నరేంద్ర, ప్రమీల, రాజేష్, దుర్గాప్రసాద్, వేణుకుమారి, శ్రీహర్ష వర్మ, మీనా, సంధ్య, ఇందిరాజ్యోతి, శేఖర్, సాగర్

**అనాజ్‌పూర్ :** వరప్రసాద్, కళ్యాణ్‌కుమార్, రామారావు, సుష్మ, మమత, చంద్రకళ.

**ఇ.సి.ఐ.యల్ :** సుజని.

'స్పర్శ' అనే మన ద్విమాస పత్రిక ప్రతి విడి పత్రిక రూ.10/–లు, సంవత్సర చందా రూ. 50/–లు, జీవితకాల చందా రూ. 1000/–లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 20.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ____________________

2. చిరునామా: ____________________

____________________

____________________

పిన్ కోడ్: ____________________

**మీ ప్రార్థనావసరతలు:**

____________________

____________________

____________________

____________________

మా చిరునామా:

**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్–70, ఫోన్: 040–2420 2227



# మార్టిన్ లూథర్

నేటి క్రైస్తవులు ఇంతటి వెలుగును పొంది, ఇంత గొప్ప స్వాతంత్ర్యమును అనుభవించగలుగుచున్నారంటే అది మార్టిన్ లూథర్ యొక్క కృషి ఫలితమే.

1393 వ సంవత్సరములలోని పరిస్థితి ఏదనగా పాపమునకై పశ్చాత్తాపపడుట అనగా పాపము కొరకై దుఃఖపడుట యాజకుని యెదుట పాపములు ఒప్పుకొనుట అని సంఘము బోధించెను. యాజకుడు పాపక్షమాపణ పలుకవలెను. దానితో పాటు కొన్ని ధర్మకార్యములు చేయనాజ్ఞాపించేవాడు. ఈ ధర్మకార్యములు చేయుటయే తమ పశ్చాత్తాపమునకు ఋజువు. ఈ విధంగా ఈ లోకములో పాపపు శిక్ష తొలగిపోవును గాని మరణానంతరము ఆ వ్యక్తి తిన్నగా పరలోకము చేరడు. మధ్యలో పరలోకమునకై శుద్ధీకరించు అగ్ని ద్వారా ఆ వ్యక్తి వెళ్ళును. ఈ పర్గేటరీ శ్రమల విషయమై అందరు భయపడేవారు. ధర్మకార్యములే ఈ బాధను నివారించునని సంఘము బోధించుచుండెను. నీవు చేయు ధర్మకార్యములు సరిపోనప్పుడు క్రీస్తు, మరికొందరు చేసిన అపరిమితమైన ధర్మక్రియలను కొన్ని కానుకల ద్వారా కొనుక్కొనవచ్చునట. క్రమేణా పోపు గారు ఇట్టి కానుకలకు పాపనివారణ పత్రమని తన స్వంత సంతకముతో ప్రజలకు అందించ ఆజ్ఞాపించిరి. పాపక్షమాపణ నిశ్చయత ఈ పత్రములో ఉన్నదని ప్రజలు కండ్లకి అద్దుకొనుచు క్రయము చెల్లించెవారు.

1476 వ సంవత్సరములో పోప్ ఈ బోధను ప్రోత్సహించి, దీనికి వేరొక బోధ కలిపిరి. బ్రతికున్న వారు చనిపోయిన వారి నిమిత్తము కూడా డబ్బు చెల్లించి వారిని పర్గేటరీ శ్రమల నుండి త్వరితముగా విడిపించవచ్చు అనే బోధ ద్వారా ప్రజలకు పాప నివారణ పత్రముల మీద ఎంతో ఆశ కలిగింది. ఇది పెద్ద వ్యాపారముగా మార్చబడింది. పర్గేటరీ శ్రమలు తప్పించుకునే దారి దొరికెనని ప్రజలు క్రయమును లక్ష్యపెట్టక కొనుచుండిరి. ప్రజలు ఎంత క్రయమైనా చెల్లించి పాపనివారణ పత్రములు కొనుటకు ఆతృత నొందెడివారు. వారి వారి ఆర్థిక స్థితిని బట్టి క్రయము నిర్ణయించబడెడిది. నిరుపేదలు ఉపవాస ప్రార్థనలతో ఈ పత్రములను పొందవచ్చునని బోధించిరి.

1483వ సంవత్సరము నవంబరు 10వ తేదీన జర్మనీ దేశములో "ఐస్ లేబెన్" అను ఊరిలో భక్తి కలిగిన తల్లిదండ్రులైన హన్స్ లూథరన్, మార్గరెట్ అను వారికి జన్మించాడు మార్టిన్ లూథర్. పుట్టిన మరునాడే తండ్రి సెయింట్ పీటర్ గుడిలోని సంఘ నాయకుడి ద్వారా చిలకరింపు బాప్తిస్మమును ఇప్పించాడు. భక్తి గల కుటుంబంలో లూథర్ యేసు అంటే మహా భయముతో పెరిగాడు. ఎందుకనగా క్రీస్తు అనగా కఠినమైన న్యాయాధిపతి, క్రైస్తవులను కఠినముగా శిక్షించేవాడు. ఆయన తల్లి మరియమ్మ, బాప్తిస్మమిచ్చు యోహాను ఆయనకు అడ్డువచ్చి ఆయన నిర్ణయించే శిక్షను తగ్గించెదరనే బోధలు లూథర్ చిన్నతనం నుండి బోధించబడుచుండెడివి. ఈ విధమైన భయముతోనే బడిలో చదువు పూర్తి అయ్యేటప్పటికి గుడిలో ఒక నమ్మకమైన సభ్యుడిగా తయారయ్యెను.

(ఇంకా ఉంది)

ఆగష్టు 15వ తేది, 2010న జరిగిన ఆరాధనలో అనేకులు ఆసక్తితో పాల్గొని దేశం కొరకు ప్రార్థించుటకు దేవుడు సహాయం చేసారు.











# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.6, భాగ్యలత కాలని,

వనస్థలిపురం, హైదరాబాద్-500 070

Ph: 040-24202227 email: mail2church@gmail.com